# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## కాంగ్రెస్‌తో మళ్ల పాత రోజులే..

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 24: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్ల కరెంట్ కష్టాలు వస్తయి. కాంగ్రెస్ నాయకుల మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మవద్దు. సీఎం కేసీఆర్ అందరికీ అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారు. ధరణి తెచ్చిన తర్వాత భూములకు భద్రత పెరిగింది. ఎలాంటి భూముల పంచాయతీ లేదు. ఎవరి భూములపై వారికే పూర్తి అధికారాలు వచ్చాయి. తెలంగాణ వచ్చినంక ఇప్పుడు రైతులు వ్యవసాయం మీద ఇంకా శ్రద్ధ చూపుతున్నారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ పాతరోజులు వస్తాయి.

*- తంగెళ్ల మోన్, హనుమకొండ*

## మూడు గంటలెట్ల సరిపోతది



నయీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతుల కోసం మూడు గంటల కరెంట్ ఇస్తామని చెప్తున్నారు. వారు ఇచ్చే మూడు గంటల కరెంట్ ఒక్క మడి కూడా తడవదు. అలా ఒక్క మడి తడవని నీటితో ఏ విధంగా ఎవుసం చేసేది. కాంగ్రెస్ నాయకులు వచ్చి పంట పండిస్తే తెలుస్తది. నోటికి ఏది వస్తే అది మాట్లాడి అధికారంలోకి వచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తామని అనుకుంటున్నారు. అలా చేస్తే తిరగబడటం ఖాయం.

*- యాదయ్య, రైతు*

## కాంగ్రెస్ అంటె కరెంట్ కోతలే..



భీమదేవరపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వమంటే కరెంటు కోతలే గుర్తుకత్తయ్..ఎప్పుడు సూడు అట్లకరంటత్తది.. ఇట్ల పోతది..బాయికాడ అదే గోస..ఇంటికాడ అదే గోస..యవసం పంటకు నీళ్ల పారిచ్చేందుకు బాయిలకాడ రాత్రిల్లు కరెంటుకోసం కావలికాసేది..పాములు, తేళ్ళు, గుడ్డెల్గులకు భయపడుకుంట బిక్కుబిక్కుమనుకుంట కరెంటు కోసం కావలి కాసేది. ఇంటికత్తె ఇంటికాడ కరెంటుండకపోయేది. దానిపాడుగానూ నీళ్ళకోసం రిగ్గులకాడికి బిందలు పట్టుకుని పోయేది. అక్కడి రిగ్గు చుట్టూ జనం ఉండేది. రిగ్గు కొట్టి కొట్టి చేతులు పోయేది. ఇప్పుడు కాంగ్రెస్ కరెంటు కోతలుండవని జెప్తాంది. నమ్మేటోల్లు ఉండద్దా..అప్పుడు పడ్డ కష్టాలు గుర్తుకు వత్తే పాణం తరుక్కపోతది. సీఎం కేసీఆర్ ఇత్తున్న 24 గంటల కరెంట్‌తో సంతోషంగ ఉంటున్నం. మూడు గంటల కరెంటిత్తె పంటల కెట్ల సరిపోతది.. ఒక్క మడి కూడా పారక రైతు రందిల పడుతడు. రైతులను ఆదుకు న్నోళ్లనే గెలిపిద్దం.

*- ఇల్లందుల బాబన్న, రైతు, ముస్తఫాపూర్, భీమదేవరపల్లి*

## మూడు గంటల కరెంటొద్దు.. కాంగ్రెసోళ్ల ద్దు



ఐనవోలు, నవంబర్ 27: రైతులు పంటలు బాగా పండించి, మంచి దిగుబడి సాధిస్తుండడాన్ని కాంగ్రెసోళ్లు ఓర్వలేకపోతున్నరు. రైతుల విషయంలో కాంగ్రెసోళ్లు పెద్ద కుట్రే చేస్తున్నారు. వాళ్లిచ్చే మూడు గంటల కరెంటు వద్దు.. వాళ్లూ వద్దు. బీళ్లుగా ఉన్న భూముల్లో ఈ పదేళ్లలో కేసీఆర్ సార్ పాలనలో రెండు పంటలు పండిస్తున్నం. కాంగ్రెస్ పాలనలో కరెంటుకు చాలా ఇబ్బందులు ఉండేవి. మూడు గంటల కరెంటుతో ఎకరం భూమి కూడా తడవదు. బీఆర్ఎస్ సర్కార్ 24గంటల ఉచిత కరెంట్ ఇస్తోంది. దీంతో రెండు పంటలు పండిస్తున్నం. నిరంతరం కరెంట్ ఇవ్వడం వల్ల తీరికను బట్టి పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నం. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల సమస్యలు తీరాయి. అప్పుల బాధలు తగ్గాయి. మళ్లీ కాంగ్రెసోళ్లు ఏదో మభ్యపెడుతున్నారు. వీళ్లు మోటర్లకు మీటర్లు కూడా పెడుతరు కావొచ్చు. తెలంగాణ రైతులు మంచిగుండాలంటే సీఎంగా కేసీఆరే ఉండాలి.


*- పిడుగు యాకమల్లు, రైతు, పెరుమాండ్లగూడెం, ఐనవోలు, హనుమకొండ జిల్లా*

## 10 హెచ్‌పీ మోటర్లతో మస్తు ఖర్చు



హనుమ కొండ చౌరస్తా, నవంబర్ 27: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని సాధ్యం కానీ హామీలు ఇస్తుంది. ఒక సామాన్య రైతు బిడ్డ 10హెచ్‌పీ మోటార్ల సామర్థ్యం తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకు లేదు. 2హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటార్ల సామర్థ్యంతో రైతు పంటలను పండిస్తాడు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థి 10హెచ్‌పీ మోటార్లతోని అని అంటున్నారు అది ఎలా సాధ్యం రైతులకు.. 10 హెచ్‌పీ మోటార్‌తో రూ.500 కరెంట్ బిల్లు రేపు వీళ్లు చెప్పే పరిస్థితి ప్రకారం రూ.5 వేలు అయ్యేలా అనిపిస్తుంది.

*- సింగారపు సత్తయ్య, రైతు, కుమార్‌పల్లి*





- ధరణి లేకుంటే భూములకు భద్రత ప్రశ్నార్థకం
- పెరిగిన భూముల ధరలు మళ్లీ పతనం
- కరెంటు లేకుంటే గణనీయంగా తగ్గిపోనున్న సాగు విస్తీర్ణం
- ఎత్తిపోతల పథకాలకు మంగళం?
- ధైర్యంగా బతుకుతున్న రైతులు ఆగం
- అన్నిరంగాలు.. అందరిపైనా ప్రభావం

# కాంగ్రెస్ వస్తే మళ్లీ వలసలే..

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం





ఎకరం పారకానికి ఎన్ని గంటల కరెంటు కావాలో తెల్వనోళ్లకా?

నీ ఓటు ఎవరికి?

తెలంగాణమా తేల్చుకో

వరంగల్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ వరంగల్(నమస్తే తెలంగాణ): గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం శక్తివంచన లేకుండా వ్యవసాయరంగ అభివృద్ధి కోసం చేసిన కృషితో భుముల ధర అమాంతం పెరిగిందనేది జగమెరిగిన సత్యం. అయితే కాంగ్రెస్ చెబుతున్న మాటలు చూస్తుంటే మళ్లీ వ్యవసాయరంగం కుదేలయ్యేలా ఉందని, రైతులు ఆత్మస్థైర్యం కోల్పోయే ప్రమాదముందనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతర కరెంటు పోయి, 10హెచ్‌పీ మోటర్లు వచ్చి ధరణి ఎత్తేసి, కౌలుదారు కాలమ్ వచ్చి, రైతుబంధుపై నీలినీడలు కమ్మితే రాష్ట్రంలో భూముల ధరలు పడిపోతాయని, ధరణి లేకుంటే భూములకు రక్షణే లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. తిరిగి పట్వారీల అజమాయిషీ వస్తే రైతుల్లో భూములపై ఇప్పడున్న ధీమా పోతుందని, కౌలుదారు కాలమ్ భయంతో స్వయంగా వ్యవసాయం చేయలేనివారు భూమిని బీడు పెడుతారు తప్ప కౌలుకు ఇవ్వరని, ఫలితంగా సాగు పడిపోతుందని రైతుసంఘాల నాయకులు అంటున్నారు.

సాగు తగ్గిపోతే ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందంటున్నారు. గ్రామాల్లో 70శాతం వ్యవసాయం మీద ఆధారపడ్డ కుటుంబాలవారు ఆదాయం కోల్పోతారని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని చెబుతున్నారు. మూడు గంటల కరెంటు వల్ల సాగుకు నీరు సరిపోక ఈ రకంగా చూసినా సాగు విస్తీర్ణం మీద దెబ్బపడుతుందని స్పష్టం చేస్తునారు. 10హెచ్‌పీ మోటర్ల వల్ల రైతులమీద అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. రైతుబంధులో కౌలుదారులు, రైతుల పంచాయితీలతో గ్రామాల్లో శాంతిభద్రతల ముప్పు వాటిల్లే ప్రమాదముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కరెంటు తీసేయడం, భూమికి భద్రత లేకుండా చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, సాగు విస్తీర్ణం పడిపోవడం ద్వారా భూముల ధరలు పతనమవుతాయని అంటున్నారు. ఇప్పుడు రెండు, మూడెకరాల రైతులకు కూడా భూముల ధరలు ఎంత భరోసాను, ధీమాను ఇస్తున్నాయని, ఫలితంగా రైతు ఆత్మహత్యలు ఆగిపోయాయని, గతంలో భూములకు పెద్ద ధరలు లేక కొద్దిపాటి అప్పులకు కూడా భయపడి ఆత్మహత్యలకు పాల్పడేవారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు భూముల ధరలు పెరిగాక అప్పులమీద భయం పోయిందని, రైతుల్లో ధీమా వచ్చిందని చెబుతున్నారు. ధరలు మళ్లీ పాతరోజులు వస్తాయని అంటున్నారు. తెలంగాణలో చిన్న కమతాలున్న కుటుంబాలవారు అనేక మంది దూరంగా ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ గ్రామాల్లోని తమ భూములను కౌలుకిచ్చి వ్యవసాయం చేయిస్తున్నారని, అంతే తప్ప కౌలుకు ఇచ్చే రైతులంతా వందల ఎకరాలున్న వారేం కాదని, చిన్న, మధ్య తరగతి ఉద్యోగులను ఈ సమస్యలన్నీ చుట్టుముడితే చిరుద్యోగులకు ఎంతో కొంత ఆసరా అయ్యే ఈ అదనపు ఆదాయం కూడా కోల్పోతారని అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోతే మళ్లీ వలసలు మొదలవుతాయని, రైతుకిచ్చే కరెంటునే కుదించే కాంగ్రెస్, కోట్ల రూపాయలు పోసి ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో నడిపిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం దాదాపు 10వేల కోట్ల దాకా విద్యుత్ సంస్థలకు సబ్సిడీ ఇస్తున్నారని, కాంగ్రెస్‌కు ఇంత సొమ్ము ఇచ్చే గుండె ధైర్యం ఉంటుందా? అనేది ప్రశ్నార్థకమేనంటున్నారు. పదేండ్ల కాలంగా కేసీఆర్ కష్టపడి నిర్మించిన గ్రామీణ వ్యవస్థ దెబ్బతింటుందని, ఈ వ్యవస్థను నిలబెట్టేందుకు చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం, విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థ, గోదాముల నిర్మాణం, మార్కెట్ యార్డుల విస్తరణ, రైతువేదికల శిక్షణ సమాచార వ్యవస్థ అన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయంటున్నారు. ఒక్కొక్కటిగా పేర్చి నిర్మించిన వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన చెందుతున్నారు.

## భూముల విలువ పడిపోతుంది..



నర్సంపేట : రైతులు, కౌలు రైతులకు మధ్యన వివాదాలు వస్తాయి. రైతుబంధును కౌలు రైతులు, రైతుల్లో ఎవ్వరికైనా ఒకరికే ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. దీనివల్ల రైతులు, కౌలు రైతులుకు మధ్య గొడవలు జరిగి, శాంతిభద్రతల సమస్యలు ఏర్పడతాయి. కరెంటు మూడు గంటలే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ నాయకులను నమ్మి రైతులు వ్యవసాయం చేయలేరు. రైతుల భూములకు విలువ కూడా బాగా తగ్గిపోతాయి. సీఎం కేసీఆర్ పాలనలోనే పుష్కలంగా సాగునీరు, విద్యుత్‌తో పాటు రైతుబంధు ఇవ్వడంతో భూములకు విలువ పెరిగి, రైతులు భరోసాతో బతుకుతున్నారు. రైతుబంధుతో రైతులకు ఎంతో ఉపయోగపడింది. ఇప్పుడు ధరణి ఎత్తేస్తామని, సీఎం కేసీఆర్ డబ్బులను వృథా చేస్తున్నారని అంటున్నారు. ఇలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం కరెక్ట్ కాదు. దీని వల్ల నష్టపోయేది రైతులే. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పాలి. రైతులందరూ బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలి.

*- కొమ్ము రమేశ్‌యాదవ్, న్యాయవాది*

## ధరణి రద్దు చేస్తామనే ఆలోచనే తప్పు



ఐనవోలు: సీఎం కేసీఆర్ ధరణితో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ధరణితో భూములపై అధికారుల పెత్తనం పోయింది. గతంలో డబ్బులిస్తే ఒకరి భూమిని ఇంకొకరి పేరుమీదకు మార్చేవారు. సర్వే నంబర్లు తారుమారు చేసి రైతులను ఇబ్బంది పెట్టేవారు. డబ్బు, పలుకుబడి ఉన్న వాళ్ల మాట చెల్లేది. ధరణి రావడం, వీఆర్వోలను వేరే డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేయడంతో భూమిపై పూర్తి అధికారం రైతులకే దక్కింది. ధరణితో భూముల రిజిస్ట్రేషన్లు ఇబ్బందులు లేకుండా క్రమపద్ధతిలో జరుగుతున్నాయి. ధరణితో సర్వే నంబర్లు తారుమారు అయ్యే అవకాశం లేదు. ధరణిలో కొన్ని కొత్త సవరణలు తీసుకువస్తే చాలు.

*- బొల్ల అనిల్, రైతు, పున్నేలు, ఐనవోలు*

## కౌలుదారుల కాలమ్ చేర్చితే రైతులకు నష్టమే

చెన్నారావుపేట: సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకురావడంతో నకిలీలకు అడ్డుకట్ట పడింది. ఇంచు జాగ తీసుకోవాలన్నా పట్టాదారుడి వేలిముద్ర కావాలి. సీఎం కేసీఆర్ ఆలోచనా తీరు ఒక అద్భుతం. వ్యవసాయ రంగానికి మేలుచేసే సీఎం కేసీఆర్ రైతు కుటుంబాల పాలిట దేవుడు. కాంగ్రెస్ నాయకులు ధరణి వ్యవస్థను రద్దు చేస్తామని చెబుతున్నారు. భూమాత పేరుతో కౌలుదారుల కాలమ్ చేర్చితే రైతు నష్టపోయే ప్రమాదం ఉంది. ధరణి ఎత్తివేస్తే గతంలో రెవెన్యూ వ్యవస్థలో జరిగిన లోపాలే మళ్లీ జరిగే ప్రమాదం ఉంది. ధరణిని కాపాడేందుకు రైతులందరూ సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలి. కాంగ్రెస్ వారి కపట ప్రేమను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలి.

*- మహేందర్, కోనాపురం, చెన్నారావుపేట*



## మూడు గంటల కరెంటుతో గొడ్లకు మేత కూడా పండదు..

హసన్‌పర్తి: వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలన్న రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు ఏం తెలుసు? వ్యవసాయం గురించి తెల్వనోడు మాట్లాడుతే గిట్లనే ఉంటది. ఆయన చెప్పిన మూడు గంటల కరెంటు గొడ్లకు వేసే మేత ను కూడా పండించలేం. కాంగ్రెస్ హయాంలో కరెంటు ఎప్పుడు వస్తదో తెలువని పరిస్థితి ఉండేది. రాత్రింబవళ్లు చేన్ల కాడ పడుకొని ఉండేది. ఎప్పుడు పాము, తేలు కాటుకు గురవుతామేమోనని ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని బతికేది. కరెంటు సక్కగ రాక వేసిన పంటలు ఎండిపోయి రైతులు తెచ్చిన అప్పులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకున్నరు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ రైతులకు ఉచితంగా 24గంటలు కరెంటు ఇచ్చి కాళేశ్వరం నీళ్లు తెచ్చి చెరువులను నింపిండు. రైతులకు అందుబాటులో విత్తనాలు ఎరువులను ఉంచి, పెట్టుబడికి ఎకరాకు రూ.10వేలు ఇచ్చి పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆర్థికంగా ఎదిగేలా చేసిండు. రైతులకు ప్రమాదకరంగా చనిపోతే ఆకుటుంబానికి రూ.5లక్షలు ఇచ్చి ఆదుకున్నడు. రైతు కుటుంబాలకు ధైర్యాన్ని ఇచ్చిండు. మోసం చేసే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజ లు బుద్ధి చెప్పుడు ఖాయం.

*- సూరం ధర్మారెడ్డి, మునిపల్లి, హసన్‌పర్తి మండలం*



## ధరణి లేకుంటే కబ్జాలు పెరుగుతయ్..

పర్వతగిరి: కేసీఆర్ సారు ధరణి తీసుకరాకపోతే కబ్జాలు పెరిగి రైతాంగానికి ఇబ్బందులు ఉండేవి. ధరణి లేకుంటే భూముల రిజిస్ట్రేషన్లలో పైరవీకారుల బెడద పెరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తే మళ్లీ రెవెన్యూ సిబ్బంది, పైరవీకారులు కలిసి ఒకరి భూమిని మరొకరి పేరు మీద మార్పులు చేసి రైతులను నానా ఇబ్బందులు పెడుతరు. సీఎం కేసీఆర్ సారు రైతుబంధుతో పెట్టుబడికి అప్పులు తేకుండా చేశారు. 24గంటల కరెంటును తీసేసి మూడు గంటలు ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్‌ను గెలిపియ్యం. కాంగ్రెస్ పాలనలో రాత్రిపూట కరెంటుతో అనేక ఇబ్బందులు పడెటోళ్లం. మూడు గంటలు పాటు కరెంటు ఇస్తే 10 హెచ్‌పీ మోటర్లు బిల్లులు ఎవరు ఇస్తారు? రైతులు మళ్లీ బీఆర్ఎస్‌కే మెజారిటీ ఇస్తం. మన కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటది.

*- పంతంగి కనుకయ్య, రైతు, కొంకపాక*



## మళ్లీ పాత కష్టాలే..



కాజీపేట : కాంగ్రెస్ ధరణి తీసేస్తామని చెబుతున్నట్లు తీరు చూస్తే రైతుల వ్యవసాయ భూముమ రికార్డులు తారుమారై ఆగం అయ్యే పరిస్థితి ఉంటది. దళారులు పుట్టుక వస్తారు. అధికారులది, దళారులది ఇష్ట రాజ్యమైతది. మళ్లీ పాత గొడవల పరిస్థితి వస్తుంది. ధరణిని తీసేసి రైతుల మద్య గొడవలు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ చూస్తుంది. ఇది సరియైన పద్దతి కాదు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ ధరణి తీసుక రావడం వల్ల రైతులు తహసీల్దార్ కార్యాలయాల్లో క్షణాలలో రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. రైతుకు ఉన్న భూమి తనకు తెలువకుండ వ్యవసాయ భూమి ఏ రికార్డు మారదు. దళారులకు, అధికారులకు లంచం ఇవ్వడం అవసరం లేదు. ఇలాంటి ధరణిని కాంగ్రెస్ పార్టీ తీసివేస్తామని చెప్పడం రైతులకు మళ్లీ పాత కష్టాలు తప్పవ్. అన్ని విధాల రైతులను ఆదుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి గెలిపించి, ధరణిని తీసేస్తానంటున్న కాంగ్రెస్ పార్టీకి రైతులు గుణపాఠం చెబుతారు.

*-కడారి దశరథం, గాంధీనగర్, దర్గా, కాజీపేట*